తెలియదు. కవిసమ్మేళనాలను శీర్షికపై నవకాలికులగు కవులనెందరినో విడచి, వీరి మువ్వురినే ప్రశంసించుట వారి సంకుచితభావమునకు ప్రబలమగు తార్కాణము.

ఇట్టి పాక్షిక ప్రచారాన్ని ఖండిస్తూ స్థానిక తెనుగుదేశ వారపత్రికాముఖమున "ఉదధి" వ్యాస పరంపరలు ప్రకటితమగుచున్నప్పటికి వీరికి జ్ఞానోదయము కలుగలేదు. అహం వున్నంతవరకు కలుగదేమో?" చేతస్సరసిజమును సమర్పించు భావం మొదటికే రాదేమో? 'ఉదధి'యను ప్రచ్ఛన్న రచయితను ప్రశంసిస్తూ పరుల ఖండిస్తూ వ్రాసి తత్పరిణామమగు తీవ్ర విమర్శకు గురియైన విషయము నిప్పటికైన జ్ఞప్తికి తెచ్చుకోవలయును. 'ఉదధి' ఎండిపోయినదన్నారు. మహాకవిగారి కవిసమయము కాదుకదా సాగరమెండుట. తెలంగాణయని కేకలువేయక కవితాధారనింకిపోక మునుపే కావ్యరచన చేయవలసిందని కోరుచున్నాను. ప్రతిభలేనివారిని పొగడుటాత్మవంచన- పరులను వంచించుట కూడా. ఇంతకంటె వ్రాయజాలను- దోషనిర్ణేతకిది యంకితమగుగాక.

---

కథానిక

# రికార్డు బుక్కు, రామేశం

తాసీరా

"సారీ, మీ రికార్డు బుక్కు మావూళ్లో పెట్టి మరిచిపోయి వచ్చాను" అంది విజయలక్ష్మి. కాని ఆమెలో ఆ మాటన్నప్పుడు 'సారీ' తాలూకు జాడలేవీ లేవు. నవ్వుతూనే అంది. పక్కనున్న లేడీ స్టూడెంట్సు చిన్నగా నవ్వారు.

"అరె, ఎట్లాగివ్వడు!" అని మెల్లిగా, కాసేపు చుట్టుపక్కలు చూసి, ఎవరూ రావటంలేదుగదా అని సంతృప్తిపడి, అదుర్దాగా, ఒణుకుతూ, అన్నాడు రామేశం. కాని ఏరీ వాళ్లు? అల్లంత దూరాన పోతున్నారు. రామేశం దిమ్మరతిరిగిపోయాడు. ఏం జవాబది, అర్థంలేని జవాబు! పైగా అలా నవ్వటందేమిటి? చేసిన తెలివిమాలిన పనికి విచారించక. సరిగా జవాబైనా ఇవ్వకుండా ఇట్టే వెళ్లిపోయిందేం? రామేశానికేం అర్థంకాలేదు. ముఖాన్ని అసమర్థత సూచించే విచారపు ఛాయలు కమ్ముకున్నాయ్. అక్కడ్నుంచి లైబ్రరీకన్నా వెళ్ళకుండా, తిన్నగా రూం చేరుకొన్నాడు. పళ్ళనర్థంలేకుండా కొరుక్కుంటూ పుస్తకాలను టేబిల్ మీద విసుగ్గా పారవేసి, కుర్చీలో కూలబడ్డాడు.

ఎంత పని చేసింది విజయలక్ష్మి! ఛీ, అసలు కాలేజీ లేడీస్టూడెంట్సును నమ్మగూడదు. ఒక్కోసారి వాళ్ళు మెత్తవారిని ఆటలు ఆడిస్తారని, బాధిస్తారని, తనీ కాలేజికి వచ్చిన తరువాతనే విన్నాడు. అసలు తనెందుకిచ్చాడు ఆమెకు రికార్డు? ఇవ్వక ఏం చేస్తాడు ఆ సమయంలో. సెలవులు రేపిస్తారనగా, "ఏమండీ, మీ రికార్డు కొంచెం ఇస్తారా సెలవుల్లో రాసుకుని ఇస్తాను. అందులో మీరు రికార్డును చక్కగా రాసి, అందంగా అట్టే పెడ్తారట" అని నవ్వుతూ మధురంగా అంది; ఒంటరిగా, ఎవ్వరూలేరు పక్కన. తనకేం తోచలేదు. ఆమె అందమైన ముఖంలోకి చూచాడు నిస్సహాయంగా. అంతే, ఇక రికార్డు ఆమెకు ఒణుకుతూ ఇచ్చి వూరుకొన్నాడు. దాన్ని మళ్ళీ ఎప్పుడిస్తారనిగాని, త్వరగా ఇవ్వాలి సుమా అని గాని అనలేదు. అసలెక్కడా నోరు పిడచగట్టుకుపోయి మాటరాకపోతేనే!

ముందెలా? రికార్డు లేకపోతే ప్రాక్టికల్సుకు అటెండ్ గానీయడుగదా లెక్చరరు. ఎట్లా, ఏం చేయటం? ఆమెను తొందరగా తీసికొని రావాల్సిందని నొక్కి చెప్పాలి. కాని ఆమె ముందర ఆ నొక్కిచెప్పటం సులభసాధ్యమైన పనిగాదు. అసలామెను కలుసుకోవాలంటే తన మనస్సుకెన్నో అడ్డంకులు. పక్కనెవరూ లేకుండా చూసిగాని మాట్లాడలేదు. వెధవలుచూచి ఏమేమో పుకార్లు పుట్టిస్తారు. ఇంకో బాధావుంది. ఒకవేళ కష్టపడి, ఎవరూలేకుండా చూసి ఆమెను కలుసుకోవాలంటే ఆమె ఒక్కతే వుండదు. పక్కన

ఐదారుగురు లేడీ స్టూడెంట్సు వుంటారు. అంత మందిలో మాట్లాడాలంటే కేవలం ముళ్ళమీద కూర్చున్నట్టే వుంటుంది. వాళ్ళ ముందు ఎంతో గమ్మత్తుగా ఫీలవుతాడెందుకో. ఛీ!

ఇంతలో చర్చి అరు గంటలు కొడుతూంది. రామేశం ఆలోచనల్లో మునిగివున్నవాడల్లా తృళ్ళిపడి, రూం తాళంవేసి, మెస్‌కు వెళ్ళాడు. ఆవేళ మీల్సు ఏం రుచించలేదు. మళ్ళీ వచ్చి గడియ వేసుకొని కాట్ మీద పడుకున్నాడు. మళ్ళీ రికార్డు బుక్కు గురించిన ఆలోచనలే పీడిస్తున్నాయ్.

నా రికార్డు పోవటానికి ఆమెవుద్దేశ్యంఏమిటో అంటే తనదిగూడా మరచిపోయి వచ్చిందేమో? అసలంత మతిమరుపా మనిషికి. ఎప్పుడు తీసికొని వస్తుంది ఇంటినుంచి? తానాసంగతి ఎక్కడ అడిగాడామెను? ఛీ, వచ్చేవారంలోనన్నా, దాన్ని నాకు అప్పగిస్తుందా! ఏమో ఒకవేళ తీసికొనిరాక పోయినా ఏంచేయలేడు తను ఛీ, తను ఒక్క...! కుర్చీలో కూర్చుని పుస్తకాలు ముందరవేసుకొని పేజీలు తిరగవేస్తున్నాడు రామేశం. చూపు వాటిమీద నిల్వటంలేదు ఏదో అసహ్యంగా జుట్టు పీక్కుంటున్నాడు. విసురుగా కుర్చీలోంచి లేచి లైటు ఆఫ్‌చేసి, తిరిగి పడుకున్నాడు.

కాసేపటికి మనసు కొంచెం స్థిమితం చేసుకొన్నాడు - రేపు సాయంకాలంచూసి ధైర్యం తెచ్చుకొని, నాలుగూ అడిగేస్తాను. ఎప్పుడిస్తుందో ఏమిటో? కాసేపటికి నిద్రపట్టింది.

* * *

రామేశం మర్నాడు రోజుకన్న గంటముందర కాలేజీకి వచ్చాడు. లేడీస్ వైటింగ్‌రూమ్ పరిసరాల్లో దేనికో అదేపనిగా తిరుగుతున్నాడు, ఇంకా ఎవరూ రాలేదు ఛీ, ఇంత తొందరగా రావటం దండుగనుకున్నాడు. ఆ విజయలక్ష్మి వచ్చేసరికి, పదీ అవుతుంది. అప్పటికి కాలేజీ స్టూడెంట్సు వచ్చిపడతారు. ఎట్లా? ఏం తోచలేదు. అల్లాగేతిరుగుతున్నాడు. ఇంతలో అల్లంత దూరాన ఎవరో ఇద్దరు లేడీ స్టూడెంట్సు వస్తున్నారు. వారిలో ఒకామె విజయలక్ష్మి అయితే ఎంతబాగుండును - అనుకొని నిశితంగా పరిశీలించాడు, వాళ్ళని. కాదు. విజయలక్ష్మి వాళ్ళయిద్దరిలోలేదు. ఇక నిరాశతో అక్కడ్నించి కదలి వెళ్ళిపోయాడు. ఇక ఆమెవచ్చినా సాయంకాలంగాక లుసుకోవటం అసంభవం. మధ్యాహ్నం వీలుంటుంది. అప్పుడు పక్కనెవరూ వుండరు కొంత సంతృప్తి చెందాడు రామేశం.

మధ్యాహ్నం అనుకొన్నట్టు వాళ్ళ వైటింగ్ రూంకివచ్చి నిలబడ్డాడు. కొంచెం పక్కకు వంగి చూచాడు. విజయలక్ష్మి ఎవరితోనో మాట్లాడుతోంది. తన్ను చూడలేదు. కాసేపు అటూ ఇటూ తిరగటంసాగించాడు రామేశం. అప్పుడప్పుడు లోపలికి చూస్తున్నాడు. అరె ఎంతసేపటికి ఇటు పక్కకన్నెత్తి చూడదే అనుకొన్నాడు. ఇంతలో భుజంమీద ఎవరిదో చెయ్యిపడింది. అరె! మురహరిరావు, స్నేహితుడు.

"ఏం రామేశం, ఇక్కడ తారట్లాడుతున్నావేమిటిసంగతి, ఏ అమ్మాయి నేనా కలుసుకోవాలా కొంపతీసి?" నవ్వుతూ అన్నాడు.

"అఁహా, అఁహా... ఛీ ఛీ నాకేంపనిరా" అని తడబడ్డాడు రామేశం. ఈ సమయంలో మురహరిరావు రావటం, ఏంబాగాలేదు. లోపల తిట్టుకున్నాడు. తిరిగి క్లాసుకు వెళ్ళాడు సాయంత్రం ప్రయత్నించవచ్చని.

క్లాసులో విజయలక్ష్మివంక పరికించిచూచాడు రామేశం. ఆమె అసలు ఇటువైపే చూడటంల్లేదు. లెక్చరరు చెప్పేది ఆ చెవినుంచి ఈచెవిలోగుండా పరుగెత్తుతూంది. చివరన 'రికార్డుబుక్కులు నాల్గు రోజుల్లో విధిగా సబ్మిటు చేయాలి, లేనిపక్షంలో క్లాసుకు రానీయకపోవటం, ఫైనువేయటం జరుగుతుంది జ్ఞాపకముంచుకోండి' అన్నాడు. రామేశం త్రుళ్ళిపడ్డాడు ఆమాటలు విని. మిగతా విద్యార్థులలో చిన్నగా నవ్వులు చెలరేగుతున్నవి. ఎట్లా ఇప్పుడు? నిజంగా గట్టిచిక్కు వచ్చిపడిందే! విజయలక్ష్మివంక పరికించి చూశాడు. ఆమె గూడా నవ్వుతున్నది. ఆమె తనరికార్డు తెచ్చుకోందేమో. అట్లా అయితే నాదెందుకు తేలేదు?

పక్కనున్న మురహారిరావు ఏం రామేశం రికార్డు పూర్తిచేశావా?"అని అడిగాడు.

"అఁ!" మెల్లిగా లోగొంతుకతో జవాబిచ్చాడు రామేశం.

క్లాసు వదిలారు. పిల్లలందరూ వెళుతున్నారు. తను చివరకు మిగిలి, ఏటో సంగతి అంతు తేల్చుకుందామని అనుకొన్నాడు. కాని మురహరిరావెక్కడా వూరుకొంటేగగా, ఊ! పద, అని లాగుకు వెడుతున్నాడు. విధిలేక వెంబడివెళుతూ రూముకి వచ్చేశాడు.

కింకర్తవ్యం? నిజంగా రొంపిలో ఇరుక్కున్నాడు. తను ఈ నాలుగురోజుల్లో ఎప్పుడు వీలవుతుంతో అసలు అడగటానికామెను, ఇక దాన్ని ఎప్పుడు తీసుకువస్తుందో, పోనీ ఒకపనిచేస్తే, ఆమె ఇంటికివెళ్ళి తెలుసికొస్తే. ఎట్లా? ఆమె అడ్రసు తెలియదు. ఎవర్నన్నా అడగవచ్చు. కాని వెధవలు అనవసరపు ప్రశ్నలతో చంపిపారవేస్తారు. పుకార్లు పుట్టిస్తారు.” రామేశం మెల్లగా రూంకి తాళంవేసి స్నానానికి వెళ్ళాడు.

తరువాత రెండురోజులు చూచాడురామేశం. కాని ఎందుకో విజయలక్ష్మి కాలేజీకి రాలేదు ఆ రెండురోజులు. కారణం వూహించుకో లేకపోయాడు. ఒకవేళ తన వూరుకు వెళ్ళి రికార్డు బుక్కులు పట్టుకురాడానికి వెళ్ళిందేమో” అని అప్రయత్నంగా అనుకొన్నాడు. కొంచెం మనశ్శాంతి చిక్కింది.

మూడోరోజు కాలేజీకి విజయలక్ష్మివచ్చింది. ఆమెను చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది రామేశానికి. తప్పక తన రికార్డు బుక్కు తెచ్చి వుంటుందని అనుకొన్నాడు. ఇపుడామె పుస్తకాల్లో తన రికార్డులేదు. బహుశా ఇంటివద్ద వుంచిదేమో మరి. ఇవ్వాళ ఎగేనా ఆమెతో మాట్లాడేసెయ్యాలి. అని ధృవపర్చుకొన్నాడు. క్లాసులో ఆమెకేసి ఎన్నోసార్లు చూశాడు. కాని ఆమె చూడటంలేదు, ఎప్పుడన్నా తనవైపున వున్నవారివంక చూస్తుంది. అంతే తనవైపు చూడలేదు. చూస్తే తెలిసిపోను తన రికార్డు తీసికొని వచ్చిందీ, లేందీని. ఛీ ఏమిటో ఈ పరిస్థితులు-అంతా తనకు ప్రతికూలమే అనుకున్నాడు.

క్లాసువదిలారు. వెళుతున్నారు స్టూడెంట్సు. రామేశం ఆలస్యం చేశాడు- పుస్తకాలు సర్దుకోవటంలో. అందరూ వెళ్ళిపోయారు. చివరకు లేడీ స్టూడెంట్సు వెళుతున్నారు. ఇదేసమయమనుకొని లేచాడు. పక్కద్వారంగుండా బయటికి వచ్చాడు. విజయలక్ష్మివాళ్ళు గజం ముందుగా వెళుతున్నారు.

“ఇదిగో, చూడండి, నా రికార్డు——”రామేశం చేయి ముందుకుచాచి అన్నాడు. కాని వాళ్ళ గుసగుసలలో సరిగ్గావినపడలేదు-తలెత్తిచూడలేదు.

కాసేపు వెంటాడి అడుగుదామనుకొన్నాడు. కాని ఎట్లా? వెధవది పక్కనెంతమందో నడుస్తున్నారు, ఛీ. తిట్టుకున్నాడు తననే. ఎందుకు అడగలేక పోతున్నాడు. అడగలేడేమో తనింక! రేపేగద ప్రాక్టికల్సు. రికార్డు సబ్మిట్ చేయాల్సిన రోజు. వెధవది ఫైనుకట్టడానికి ఇష్టమేగాని, క్లాసుకు రానీయకపోతే ఎంతోదండుగ. ప్రాక్టికల్సులో వెనకబడటం ఒకటి. రేపు నీ రికార్డు ఏదని లెక్చరరు అడిగితే ఏం సమాధానంరావాలి తన నోటినుంచి. పక్క విద్యార్థులు వింతగా చూస్తారు తనవంక. ఒకవేళ విజయలక్ష్మి రేపు తెచ్చియిస్తుందేమో, అట్లయితే తను బతికిపోతాడు. కాని అట్లా జరగాలని ఎక్కడవుంది? ఏమో?కొంచెంమనశ్శాంతితో కాలేజీని దాటాడు.

మధ్యాహ్నం తన రూముకు మురహరిరావు వచ్చాడు. కాసేపు పిచ్చాపాటీ నాలుగూ మాట్లాడి “నీ రికార్డు కొంచెం ఇవ్వు. రాసుకుని ఇస్తాను” అన్నాడు, తను వచ్చినపని అందుకనే అంటూ. రామేశానికి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ వూహించి వుండలేదు. లేకపోతే తగిన జవాబు ముందరగానే ప్రిపేరయి వుండేవాడు. ఏం జవాబివ్వటం?

“లే-లేదు” అన్నాడు రామేశం.

“మొన్న వుందటివిగా” రామేశం ముఖం పడిపోయినతాటాకు లక్షణాలు చూచి, అడిగాడు మురహరిరావు.

“ఎక్కడో పారేసుకున్నా!”

“అదేమిటి, ఎక్కడో పారేసుకోవటం ఏమిటిరా, అది రికార్డుగదా, అంత అజాగ్రత్తగా ఎందుకున్నావు?” మురహరిరావు ఆశ్చర్యానికి మేరలేదు.

“ఏం చేస్తాను, వెధవది ఎక్కడో పెట్టి మరచిపోయాను.”

"అదేం జవాబు? చిన్నపిల్లాడి వటరా, ఎక్కడో పెట్టి మరచిపోవటానికి, అందులో ఏమన్నా చిల్లరమల్లర నోట్సా, పోతే తిరిగి రాసు కోటానికి-సైన్సు స్టూడెంట్సుకు ప్రాణంలాంటిది. ఇప్పుడా ఇక్సపెరిమెంట్సు రాయాలంటే బ్రహ్మ దులు దిగిరావాలి. అంతా వృథా-అయితే ఏం చేయదల్చుకున్నావు మరి?"

"ఏం చేయదల్చుకోలేదు."

మురహరిరావుకీ జవాబేం నచ్చలేదు. అతను రామేశానికి కాస్తమిత్రుడు. రామేశం రికార్డును తిరిగి సంపాదించిపెట్టడం తన బాధ్యతగాగుర్తించి ఆలోచిస్తున్నాడు.

"అరే రామేశం, ఒక పనిచేద్దాం. నీ రికార్డు పోయిన సంగతి నోటీసుబోర్డులో, లాస్ట్! లాస్ట్! కోలంలో వేయిద్దాం. దొరికినవాళ్లు ఇవ్వక పోతారా?"

రామేశానికీ పద్ధతి నచ్చలేదు. లోపల బాధ పడుతున్నాడు. తనెంత వచ్చి అబద్ధాలాడు తున్నాడు. కాని ఏం చేయటం, అసలు విషయం చెప్తే సిగ్గు, దాస్తే దుఃఖం. గత్యంతరంలేక 'సరే' అన్నాడు.

* * *

"ఫలానా రామేశం తాలూకు రికార్డుబుక్కు ఫలాన రంగుగలది పోయిందని, దొరికిన పక్షంలో దయచేసి ప్రిన్సిపాల్‌గారిక్కి ఇవ్వ ప్రార్థనని ప్రకటన నోటీసుబోర్డులో వేయబడింది. స్టూడెంట్సు చూసి నవ్వుకుంటున్నారు; బహుశా రామేశం అశ్రద్ధను చూసే, అయి వుండాలి. తెలిసిన స్నేహి తులు రామేశానికి జరిగినపనికి విచారం తెల్పారు.

కాని రామేశం మనస్తాపం అలాగే వున్నది. లోపలేదో చింత, ఈ నోటీసుబోర్డువల్ల తన కేం జరగదని తెలుసు-అవును, ఎట్లాజరుగుతుంది? అసలు తను రికార్డు ఎక్కడన్నా పోతేగదా. అది మరొకరికి దొరికి, తిరిగి ఇవ్వటానికి? ఆ విజయ లక్ష్మి ఇంత మోసకారి అని తెలిస్తే, ఇచ్చివుండే గాదు. ఎందుకంత మూగతన మామెకు.

ఇంతలో బెల్లు కొట్టారు - రామేశం వచ్చి క్లాసులో కూర్చున్నాడు. లెక్చరర్ వచ్చి అటెం డెన్సు వేసికొని, పాఠం మొదలుపెట్టి చెప్పుకుపో తున్నాడు. విజయలక్ష్మి వాళ్లు ఇంకా రాలేదు, క్లాసుకు.

ప్యూన్ వచ్చి "రామేశం"ను ప్రిన్సిపాలు గారు పిలుచుకురమ్మంటున్నారు అని ఒకచీటి తెచ్చాడు. రామేశం త్రుళ్లిపడి, ఆశ్చర్యపడుతూ ప్రిన్సిపాల్‌రూంకి వంచినతలతో వెళ్ళాడు. అరె, ఆశ్చర్యం తన రికార్డు ప్రిన్సిపాల్‌గారి చేతిలో వుంది. ఎట్లా వచ్చిందబ్బా! తలెత్తి చూచాడు. పక్కనే విజయలక్ష్మి వాళ్లున్నారు నవ్వుతూ.

ప్రిన్సిపాల్‌గారు రికార్డుబుక్కు నందిస్తూ "ఇదిగో తీసికో తిరిగి మళ్లీ ఎప్పుడు చిన్న పిల్లడిలా పారవేసుకోకు" అన్నాడు. రామేశానికి ఆశ్చర్యం. సంతోషం కల్గిగాయి. నెత్తిమీద పెద్ద బండ తొలిగిపోయిందని పించింది. బయటికి వచ్చాడు. విజయలక్ష్మి బయటికి వచ్చింది. ఇద్దరు ముగ్గురు లేడీ స్టూడెంట్సుతో; ఎందుకో వాళ్ళంతా పికిలిగా నవ్వుతున్నారు. ఛీ-విజయ లక్ష్మి ఎంత యేడిపించింది, తనని, అనుకున్నాడు రామేశం.

క్లాసులోకి వచ్చి మురహరిరావు పక్క తన స్థానే కూర్చున్నాడు తేలికైన హృదయంతో. రామేశం చేతిలో రికార్డు ఉండటంచూసి, ముర హరిరావు ఎంతో ఆనందించి ఎవరికి దొరికిందేమిటి సంగతని చంపేస్తున్నాడు. ఆసమయంలోనే విజ యలక్ష్మి వాళ్లు క్లాసులోకి వచ్చారు. రామేశం రికార్డు విజయలక్ష్మికి దొరికిందని గుసగుసలు బయలుదేరాయ్. ఇవివిన్న మురహరిరావు

"ఏం నీ రికార్డు దొరికినందుకు విజయలక్ష్మిని అభినందించావా?" అని అడిగాడు.

లేదన్నాడు రామేశం.

"అదేమిటిరా నీ వొతి తెలివిమాలినవాడివేరా? నా రికార్డే గనుక పోయి విజయలక్ష్మి లాంటి వాళ్లకు దొరికి, తిరిగి యిస్తుంటే "మిమ్మల్ని జన్మలో మరువలేను" అని ఎంతో కొనియాడే వాడ్నిగదా! ఆ మధురక్షణం ఎట్లామరచావు?" అని మురహరిరావు నొచ్చుకున్నాడు.

కాని రామేశం మట్టుకు అసలు విషయం బయట పెట్టలేదు, ఇక అతను జన్మలో ఏ పుస్తకం ఏ లేడీ స్టూడెంటుకీ ఇవ్వదల్చుకోలేదు. ★